కాళేశ్వరంలో ఆటో డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగే సరస్వతి పుష్కరాల్లో తమ పొట్ట కొడుతున్నారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. కాళేశ్వరంలో జరిగే పుష్కరాల సమయంలో బస్టాండ్ నుంచి గోదావరి గుడి వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉండటంతో స్థానిక ఆటోల్లో భక్తులను తరలించడం ఆనవాయితీగా వస్తుంది. ఇలా భక్తులను ఆటోల్లో తరలించడం తో స్థానిక ఆటో డ్రైవర్లకు ఉపాధి కలుగుతుంది. కానీ పుష్కరాల సందర్భంగా మండలానికి సంబంధించిన ప్రయివేట్ పాఠశాలల వాహనాలను ఏర్పాటు చేశారు. దాంతో ఉపాధి కోల్పోయి తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని తక్షణమే స్కూల్ బస్సులను తీసివేయాలంటూ ఆటో డ్రైవర్లు సుమారు రెండు గంటల పాటు ధర్నా చేశారు. పోలీసుల హామీతో ఆటో డ్రైవర్లు ధర్నాను విరమించారు.

లైబ్రేరియన్లకు పదోన్నతులు కల్పించాలి

- టిజిఒ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న లైబ్రరియన్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారులు (టిజిఒ) సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో టిజివో అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల లైబ్రరియన్ల సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రరియన్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాలూనాయక్, శివకుమార్ మాట్లాడుతూ లైబ్రరియన్లుగా నియామకమై పదోన్నతుల్లేకుండా ఆ పోస్టులోనే రిటైర్ అవుతున్నారని చెప్పారు. సరైన అర్హతలు ఉన్నా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి అవకాశం లేదని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేసే లైబ్రరియన్లకు ప్రిన్సిపల్‌గా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. లైబ్రరియన్ల క్యాడర్‌ను జేఎల్ లైబ్రరీ సైన్స్‌గా మార్చాలని కోరారు. న్యాయబద్ధమైన ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని టిజిఒ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ హామీ ఇచ్చారు.

ఎన్నికల బదిలీలపై నిర్ణయం తీసుకోండి

- త్రిసభ్య కమిటీకి రెవెన్యూ ఉద్యోగ సంఘాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహాశీల్దార్లు, డిప్యూటీ తహాశీల్దార్లను తక్షణమే వారి పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రి సభ్య కమిటీ చైర్మన్ నవీన్‌మిట్టల్, ఇతర సభ్యులను కలిసి సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన చర్చల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎన్నికల బదిలీలే ఏకైక ఉమ్మడి ఎజెండాగా ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే సాధారణంగానే జరగాల్సిన డిటి, తహాశీల్దార్ల బదిలీలు రెండేళ్లు అవుతాన్నా ఇంకా పూర్తి కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కొరకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ, తెలంగాణ తహాశీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఎ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టిజిఆర్ఎస్ఎ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి భిక్షం, టిజిటిఎ రాష్ట్ర సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా కాళేశ్వరం అభివృద్ధి

- రూ.200 కోట్లు కేటాయించేందుకు సిద్ధం
- గోదావరి, కృష్ణా పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభం



కాళేశ్వరం హారతి కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో గురువారం సరస్వతి పుష్కరాల ప్రారంభం సందర్భంగా కాళేశ్వరం హారతి కార్యక్రమంలో సిఎం, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. కాళేశ్వరం అభివృద్ధి కోసం రూ.200 కోట్లు అయినా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సరస్వతి పుష్కరాలకు వచ్చే సందర్శకులకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని సిఎం అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల కోసం తొలిసారిగా టెంట్ సిటీ ఏర్పాటు చేశామన్నారు. "త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా రానున్నాయి. వచ్చే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం క్షేత్రానికి వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం నాకు కలగనుంది" అని సిఎం అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సరస్వతీనది పుష్కరస్నానం ఆచరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పది అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సిఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది.

సరస్వతి నవరత్న మాల హారతి

ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సందర్శకులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది.

వేదవల్లి కుటుంబానికి సిఎం ఆర్థికసాయం

బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో పోరాడి ఓడిన ఎల్‌బి నగర్‌కు చెందిన చిన్నారి వేదవల్లి కుటుంబానికి ముఖ్యమంత్రి ఆర్థిక సాయం ప్రకటించారు. చిన్నారి తండ్రి రఘుకు రూ.7లక్షల చెక్కును సిఎం ఒఎస్‌డి వేముల శ్రీనివాసులు గురువారం సచివాలయంలో అందజేశారు.

వరి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

- బోనస్ కూడా చెల్లిస్తాం
- కొడంగల్ ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : సిఎస్



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అదిలాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు, ఖమ్మం నుంచి నారాయణపేట వరకు రైతులు ఎక్కువ మొత్తంలో వరి ధాన్యం సాగు చేస్తున్నారని, రైతుల పండించిన ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సిఎస్ కె రామకృష్ణారావు రైతులకు హామీ ఇచ్చారు. బోనస్ కూడా సకాలంలో చెల్లిస్తామని తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా కొడంగల్, పరిగిలో సిఎస్ పర్యటించారు. పరిగిలో పట్టణ కేంద్రంలోని సుల్తాన్‌పూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫరాల కమిషనర్ చౌహాన్‌తో కలిసి సీఎస్ పరిశీలించారు. పంట దిగుబడి, కొనుగోళ్ల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగారు. ఈ ప్రాంతంలో నీటి సమస్య ఉందని, ప్రాజెక్టులు నిర్మించాలని రైతులు కోరారు. అలాగే కొడంగల్‌లో 50 పడకల ఆస్పత్రిని 220 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్న క్రమంలో నిర్మిస్తున్న భవన పనులను సిఎస్ పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధింత ఇంజనీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. ఆస్పత్రికి రోజువారీగా వస్తున్న వివరాలను, ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ప్రసవాల సంఖ్యపై వైద్యాధికారి చందన ప్రియను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి విద్యార్థినుల, సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. అనంతరం హరే కృష్ణ సంస్థ ద్వారా పాఠశాలకు అల్పాహారం సరఫరా చేస్తున్న కిచెన్‌షెడ్‌ను సిఎస్ పరిశీలించారు. అలాగే వికారాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నారు. లక్షలాది మంది రైతులతో కూడుకున్న విషయం కాబట్టి కొన్ని చిన్న, చిన్న సమస్యలు ఉంటాయని, వాటన్నింటిని అధిగమించి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. గతేడాది రూ.12 వందల కోట్లు బోనస్ ఇచ్చామని, మరికొంత ఇచ్చేది ఉందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతులకు తప్పక సాయం చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వచ్చామని, మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ సమాచారానంతా ప్రభుత్వానికి చేరవేస్తామని తెలిపారు.

'అమ్మమాట..అంగన్‌వాడీ బాట' నినాదంతో ముందుకు

- సమీక్షలో మంత్రి సీతక్క



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'అమ్మమాట..అంగన్‌వాడీ బాట' నినాదంతో ముందుకు సాగాలనీ, అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల చిరునవ్వుకు చిరునామాగా తీర్చిదిద్దాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ లోని సచివాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై జిల్లాలవారీగా సమీక్ష నిర్వహించారు. అందులో మంత్రితో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ క్రాంతి వెస్లీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. మూడేండ్ల నుంచి ఆరేండ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బడీడు పిల్లలు బడిలో, చిన్న వయస్సు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లేస్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దాలనీ, వాటిలోని సౌకర్యాల గురించి చెబుతూ వారికి నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీడబ్ల్యూ ఓలదే అని నొక్కి చెప్పారు. అన్ని కేంద్రాల్లో మౌలిక తాగునీరు, టాయిలెట్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

కాళేశ్వరం పెద్ద కుంభకోణం

- తుమ్మిడి హట్టి పునఃనిర్మాణం చేపట్టాలి
- కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు భవిషత్తుపై రౌండ్‌టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జల సాధన సమితి ఆధ్వర్యంలో' జాతీయ డ్యామ్‌ల భద్రత సంస్థ (ఎన్‌డిఎస్ఎ) తుది నివేదిక నేపథ్యంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు భవిష్యత్తుపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ వినాయకరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ మాట్లాడుతూ తుమ్మిడి హట్టి నుండి రీ డిజైనింగ్, రీ ఇంజనీరింగ్ పేరిట మేడిగడ్డకు మార్చి భారీ బడ్జెట్‌తో ఎదురు ఎత్తిపోతలు చేపట్టడమే ఉద్దేశపూర్వకమైన అవినీతి కుంభకోణమని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కుంగిపోయే వరకు జరిగిన ఘోరమైన నిర్లక్ష్యం, తప్పులను ఎన్‌డీఎస్ఏ నివేదిక బైటపెట్టిందని తెలిపారు. మేడిగడ్డ మూడు బ్యారేజీల్లో పునరుద్ధరణకు పెట్టే ప్రతి పైసా వృధా ఖర్చని చెప్పారు. తుమ్మిడి హెట్టిని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రముఖ నీటిపారుదల నిపుణులు పి.జి. శాస్త్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ. ఇసుక బెడ్స్ పైన బ్యారేజీలు ప్రాజెక్టులు కట్టడం ఒక ప్రాకృతిక సవాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, మూడు బ్యారేజీలు ఇసుక బెడ్ పైన కట్టినవేనన్నారు. భూమి అడుగు పునాది లో బండరాయి లేదని చెప్పారు. ప్రతి బ్యారేజ్‌లో రెండున్నర టిఎంసిల కంటే ఎక్కువ నీరు నిలువ చేయకూడదని సూచించారు. రాజకీయ పెద్దల దర్శకత్వంలో ఇంజనీర్లు డమ్మీలై సృష్టించిన వినాశకర విధ్వంసమని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ 15 నెలైనా, ఎన్‌డిఎస్ఎ అన్ని నివేదికలు వచ్చినా, అవినీతిపరులను కాంగ్రెస్ పార్టీ ఎందుకు శిక్షించడం లేదని ప్రశ్నించారు. ఈ మూడు బ్యారేజీల పునర్నిర్మాణం పై డబ్బు వృధా చేయకుండా. తుమ్మిడి హట్టి బ్యారేజీని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట రామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ పెద్దలు, అధికారులు చేసిన ఘోరమైన తప్పులను నివేదికలు ఎత్తి చూపినా సంబంధిత బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడలేని విధంగా, కాళేశ్వరం మూడు బ్యారేజీల పేరిట గోదావరిపై ఎదురు ఎత్తిపోతలు నిర్మించడం తీవ్రమైన తప్పని చెప్పారు. లక్ష కోట్ల ప్రజాధనం వృధా చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ మాజీ సభ్యులు మధు యాష్కి మాట్లాడుతూ కెసిఆర్ ప్రజల ఆస్తులకు ధర్మకర్తగా లేడని, దోపిడీదారుగా ఉన్నారని విమర్శించారు. రూ.300 కోట్లు ఒకే అధికారి ధనార్జనకు పాల్పడితే.. ఆ ప్రభుత్వ పెద్దల వద్ద ఎన్ని వేల కోట్ల ధనం ఉందో ఆలోచించాలన్నారు. ఇతర దేశాల్లో అయితే ఉరిశిక్ష వేస్తారని చెప్పారు. సంబంధిత అవినీతిపరులపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.మాజీ మంత్రి విజయరామారావు మాట్లాడుతూ దేశం మొత్తంలో, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై జరిగిన చర్చ మరే ప్రాజెక్టులో జరగలేదని చెప్పారు. ఆ ప్రాజెక్టును కేసీఆర్ కల్పతరువుగా చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రాణహిత పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.వి.ప్రతాప్ , మాజీ ఇంజనీరు విటల్ రావు, జర్నలిస్ పృధ్విరాజ్, చీఫ్ ఇంజనీర్ జియో ఉద్దీన్, సాంబశివరావు, ఉపేందర్ రెడ్డి, సిపిఐ(ఎంఎల్) కార్యదర్శి ప్రసాద్ ఎంసిపిఐయు నాయకులు పెద్దారపు రమేష్, ఎఐకెఎంఎస్ నాయకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల అక్రమాలపై విచారణ జరపాలి

- రాష్ట్రంలో ఫీజులను పెంచకుండా నిర్ణయం తీసుకోవాలి
- తనిఖీల నివేదికను ఉన్నత విద్యామండలి బహిర్గతం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రయివేట్ ఇంజనీరింగ్ కాలేజీల అక్రమాలపై విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇంజనీరింగ్ ఫీజులను పెంచకుండా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు చేపట్టిన నివేదికను ఉన్నత విద్యామండలి బహిర్గతం చేయాలని తెలిపింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాలేజీల తనిఖీల్లో అనేక లోపాలు బయటపడ్డాయని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకులను నియమించకుండా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయటం కోసం సింథటిక్ వేలి ముద్రలతో నడుపుతున్నాయని పేర్కొన్నారు. అధ్యాపకులు ఎక్కువ మంది ఉన్నారనే పేరుతో ప్రభుత్వాన్ని, ఉన్నత విద్యామండలిని ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో 175 ఇంజనీరింగ్ కళాశాలలుంటే, కేవలం పదుల సంఖ్యలో ఉన్న కళాశాలలు మాత్రమే టీఏఎఫ్ఆర్సీ నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకులను నియమించాయనీ, సౌకర్యాలు కలిగి ఉన్నాయని వివరించారు. మిగతా కాలేజీల్లో ఎక్కడా ఆ రూపంలో అనుమతుల్లేవని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పొందాలనే దురుద్దేశంతో విద్యార్థులను చేర్పించుకోవటం కోసం కొత్తకొత్త కోర్సుల పేరుతో రూ.లక్షల ఫీజులు పెంచుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూడా సుమారు రూ.2.40 లక్షల వరకు ఫీజులు పెంచాలని ప్రతిపాదనలు టిఎఎఫ్ఆర్‌సికి ఇచ్చాయని తెలిపారు. అధ్యాపకుల జీతాలు, మౌలిక వసతులు కల్పించడం కోసం ఖర్చు పెడుతున్నామని కాలేజీలు చెప్తున్నాయని వివరించారు. సిఎస్ఇ సీట్లను పెంచడానికి ప్రభుత్వం దగ్గర అక్రమ పద్ధతుల్లో అనుమతులు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు.అనుమతులు తీసుకుని రూ.14 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అక్రమ డొనేషన్లు తీసుకుంటున్నాయని వివరించారు. ఇంజినీరింగ్ కాలేజీలలో ఉన్న లోపాల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి కమిటీ సమీక్ష చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజులు పెంచకుండా తగ్గించే ప్రయత్నం చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కాలేజీల అక్రమాలనన్నింటినీ బయట పెట్టి రాష్ట్రంలో పేద విద్యార్థులందరికీ ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో మహిళలపై అరాచకాలు, మోసాలు

- వారి ఆత్మగౌరవాన్ని అవమానించిన కాంగ్రెస్ సర్కారు
- సోనియాగాంధీకి మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధుల లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మహిళలపై అరాచకాలు, మోసాలతో పాటు వారి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అవమానకరంగా వ్యవహరిస్తున్నదని పలువురు మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు విమర్శించారు. ఈ మేరకు గురుచవారం మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవా లక్ష్మి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి లేఖ రాశారు. మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించే విధంగా రాష్ట్ర మహిళలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించారని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే మహిళలకు క్షమాపణ చెప్పాలనీ, లేకపోతే మహిళలు కాంగ్రెస్ పార్టీపై తిరగబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగి, తుడిచే పనులకు తెలంగాణ మహిళలను ఉపయోగించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వారు మండిపడ్డారు. తెలంగాణ ఆడబిడ్డల స్వాభిమానాన్ని అందాల పోటీదారుల పాదాల చెంత ఉంచి సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సంస్కృతిని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి చేసిన పని ఆయన బానిస మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. రేవంత్ రెడ్డి పిచ్చి పనులను నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. కాళ్లు కడిగించడం రేవంత్ రెడ్డి వికృత వ్యక్తిత్వానికి, బానిస మనస్థత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. రజాకార్లు, దొరల దౌర్జన్యం, సమైక్యాంధ్రప్రదేశ్‌లో వివక్ష, అణచివేత ఏ రూపంలో ఉన్న ప్రతిఘటించిన చరిత్ర తెలంగాణ మహిళలకుందని గుర్తుచేశారు. అలాంటి మహిళలున్న తెలంగాణ ప్రతిష్ట రేవంత్ రెడ్డి ప్రతిష్టతో మసకబారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హామీల అమలు కోసం గళమెత్తిన ఆశావర్కర్లపై కాంగ్రెస్ సర్కారు చేసిన దుశ్శాసన పర్వం, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీలో సీఎం అవమానించడం, బెటాలియన్ పోలీసుల భార్యలు సచివాలయం ముందు నిరసన తెలిపిన సమయంలో వారిపట్ల ప్రభుత్వం అత్యంత కిరాతకంగా వ్యవహరించడం, మహిళా జర్నలిస్టులను బట్టలూడదీసి కొడతామంటూ సిఎం రేవంత్ రెడ్డి బెదిరించడం కాంగ్రెస్ స్త్రీ వ్యతిరేక, నియంతృత్వ ధోరణలకు సాక్ష్యమని విమర్శించారు. సిఎం సొంత నియోజకవర్గంలోని లగచర్లలో దళిత, గిరిజన మహిళలపై పోలీసులు అర్థరాత్రి ఆకృత్యాలు చేశారని చెప్పారు. ఎన్నికలకు ముందు మహిళలకు మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెల రూ.2,500, విద్యార్థినీలకు స్కూటీలు తదితర హామీలను అమలు చేయలేదని తెలిపారు. ఒకవైపు రాష్ట్రం దివాళా తీసిందంటూనే మరోవైపు అందాల పోటీల కోసం రూ.200 కోట్లు ఖర్చు చేస్తూ మహిళలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఆ మొత్తాన్ని మహిళల సంక్షేమం, విద్య, ఉపాధి కోసం ఉపయోగిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆవిర్భావం వేళ ఇది ఆత్మగౌరవానికి సంకేతంగా నిలవాలంటూ ఆశించిన సోనియాగాంధీ, మహిళల ఆత్మాభిమానంతో ఆటలాడుతున్న సిఎం రేవంత్ రెడ్డిని నియంత్రించరా? అని సోనియాగాంధీని ప్రశ్నించారు. సిఎం, కాంగ్రెస్ పార్టీ మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యలపై ఉన్నతస్థాయిలో చర్చిస్తాం

- ఆ తర్వాతే నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పిస్తాం
- ఉద్యోగ జెఏసి ప్రతినిధులతో అధికారుల కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగుల డిమాండ్లను విన్నామనీ, వాటిని అర్థం చేసుకున్నామని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, సిసిఎల్ఎ, అధికారుల కమిటీ చైర్మెన్ నవీన్ మిట్టల్ వ్యాఖ్యానించారు. ఉద్యోగుల సమస్యలపై ఉన్నతస్థాయిలో చర్చిస్తామని ప్రకటించారు. అవసరమైతే నాలుగైదు రోజుల్లో మరోసారి ఉద్యోగ జేఏసీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాతే ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలూ, వాటి పరిష్కారాలపై నివేదికను రూపొందించి మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పిస్తామని వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారుల కమిటీతో తెలంగాణ ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఉద్యోగ జెఏసి మొదటి సమావేశంలో ఇచ్చిన 57 డిమాండ్లపై సమగ్రంగా చర్చ జరిగింది. అధికారుల కమిటీ శాఖల వారీగానూ చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నది. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే ప్రకటించాలని ఉద్యోగ జెఏసి చైర్మెన్ మారం జగదీశ్వర్ కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులు సుమారు రూ.పది వేల కోట్లు ఉన్నాయనీ, వాటిని విడుదల చేయాలని సూచించారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికేతర సమస్యలు 47 ఉన్నాయనీ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులు ఒపిఎస్‌ను అమలు చేయాలని వివరించారు. ఈహెచ్ఎస్‌ను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. 317 జిఒ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారుల కమిటీ సభ్యులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్‌తోపాటు ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, కోచైర్మెన్ చావ రవి, అడిషనల్ సెక్రెటరీ జనరల్ పి దామోదర్‌రెడ్డి, కోచైర్మెన్లు వి రవీందర్‌రెడ్డి, పి మధుసూదన్‌రెడ్డి, ఎం పర్వత్‌రెడ్డి, నరహరి, మోహన్ నారాయణ, దాస్యా నాయక్, డిప్యూటీ సెక్రెటరీ జనరల్స్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, వైస్ చైర్మెన్ బి శ్యామ్, ప్రచార కార్యదర్శి గౌతమ్, కార్యదర్శి సత్యనారాయణగౌడ్, నాయకులు పి కృష్ణమూర్తి, జ్ఞానేశ్వర్, గోల్కొండ సతీశ్, జహంగీర్, కె రామారావు, లక్ష్మణ్‌గౌడ్, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని ఇంజనీరింగ్ ఫీజు!

- అధికారుల మధ్య కుదరిన ఏకాభిప్రాయం
- మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయం
- పెంపుపై టిఎఎఫ్ఆర్‌సి కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


రాష్ట్రంలోని ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. ఫీజుల ఖరారుకు సంబంధించి అధికారులు తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. వారి మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అయితే ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులను పెంచడంపై తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టిఎఎఫ్ఆర్‌సి) కసరత్తు చేస్తోంది. మంగళవారం హైదరాబాద్‌లో టిఎఎఫ్ఆర్‌సి సమావేశం జరిగింది. ఇందులో టిఎఎఫ్ఆర్సీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనతోపాటు ఆర్థిక శాఖ అధికారి, ఇతర సభ్యులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న ఫీజులు 2024-25 విద్యాసంవత్సరంలో ముగిసింది. 2025-26, 2026-27, 2027-28 విద్యాసంవత్సరాలకు సంబంధించి కొత్త ఫీజులు ఖరారు చేయాల్సి ఉంది. వాటిని అమలు చేయాల్సి ఉంటుంది. దీనిపైనే టిఎఎఫ్ఆర్‌సి కసరత్తు ప్రారంభించింది. కాలేజీల వారీగా ఫీజులను పెంపునకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఫీజులను పెంచడానికి ఉన్న హేతుబద్ధమైన కారణాలను ఏంటో చెప్పాలని ఆర్థిక, విద్యాశాఖ అధికారులు టిఎఎఫ్ఆర్‌సి అధికారులను అడిగినట్టు తెలిసింది. ఏ ప్రాతిపదికన కాలేజీలకు ఫీజులను ఖరారు చేశారు, పెంచడానికి ఉన్న కారణాలను వివరించాలని కోరినట్టు సమాచారం. కాలేజీల ఆడిట్ నివేదికలు, ఆదాయ, వ్యయాలను పరిశీలిస్తున్నారు. ఒక కాలేజీకి 80 శాతం, మరో కాలేజీకి 70 శాతం, ఇంకో కాలేజీకి అసలు ఫీజులను పెంచకపోవడమేంటనీ ప్రశ్నించినట్టు తెలిసింది. అందుకే కాలేజీల వారీగా ఫీజులను ఖరారు చేయాలంటే మరోసారి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈలోగా ఫీజుల పెంపునకు తీసుకున్న చర్యలు, అందుకు గల కారణాలను ప్రత్యేకంగా సిద్ధం చేయాలని టీఏఎఫ్ఆర్సీని కోరినట్టు తెలిసింది. టీఏఎఫ్ఆర్సీ రూపొందించిన ప్రతిపాదనలను ఆర్థిక, విద్యాశాఖ అధికారులు అంగీకరించకపోవడంతో ఫీజుల పెంపు ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఇప్పటికే ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఫీజుల పెంపు ప్రక్రియ కొలిక్కి వస్తే ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలకు మార్గం సుగమం అవుతుంది. ఇప్పటికే ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను ఇచ్చేందుకు జెఎన్‌టియు హైదరాబాద్‌తోపాటు ఓయూ, కేయూలు అధికారులు తనిఖీలు చేపట్టారు. త్వరలోనే వాటిని అనుబంధ గుర్తింపు రానుంది.

భారీగా పెరిగే అవకాశం

ఇంజనీరింగ్ ఫీజులు భారీగా పెరిగే అవకాశముంది. రాష్ట్రంలో కొత్త ఫీజుల కోసం 157 ఇంజినీరింగ్ కాలేజీలు టిఎఎఫ్ఆర్‌సికి దరఖాస్తు చేశాయి. ఇంజనీరింగ్ కాలేజీల గరిష్ట ఫీజు రూ.2.45 లక్షలు, అత్యల్ప ఫీజు రూ.45 వేలు ఉండాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ ఫీజులు ఇంకా ఖరారు కాలేదు. సుమారు 45 కాలేజీల ఫీజు రూ.రెండు లక్షలు దాటే అవకాశమున్నది. రాష్ట్రంలో అత్యధికంగా ఎంజీఐటీ ఫీజు రూ.1.60 లక్షల నుంచి రూ.2.45 లక్షల వరకు పెరగనుంది. సిబిఐటి ఫీజు రూ.1.65 లక్షల నుంచి రూ.2.23 లక్షల వరకు, వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఫీజు రూ.1.35 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు, వాసవి కాలేజీ ఫీజు రూ.1.40 లక్షల నుంచి రూ.2.15 లక్షల వరకు, ఎస్ఆర్ కాలేజీ ఫీజు రూ.1.30 లక్షల నుంచి రూ.రెండు లక్షల వరకు, సీవీఆర్ కాలేజీ ఫీజు రూ.1.50 లక్షల నుంచి రూ.1.98 లక్షల వరకు, జి నారాయణ ఫీజు రూ.లక్ష నుంచి రూ.1.95 లక్షల వరకు, వర్ధమాన్ కాలేజీ ఫీజు రూ.1.40 లక్షల నుంచి రూ.1.90 లక్షల వరకు, కిట్స్ (వరంగల్) ఫీజు రూ.1.25 లక్షల నుంచి రూ.1.90 లక్షల వరకు, శ్రీనిధి ఫీజు రూ.1.30 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు, బివిఆర్ఐటి ఫీజు రూ.1.20 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు పెంచాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిసింది.

వర్షాల నేపథ్యంలో నేడూ ఆరెంజ్ హెచ్చరిక

- వచ్చే ఐదు రోజులపాటు పలు జిల్లాలకు వర్ష సూచన
- రాష్ట్రంలో తగ్గిన ఉష్ణోగ్రతలు
- చురుగ్గా ముందుక్ను సాగుతున్న నైరుతి రుతుపవనాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శుక్రవారం కూడా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో వచ్చే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందనీ, సాయంత్రం, రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వానలు, చిరుజల్లులు పడే సూచనలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో గురువారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు వందకుపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా మోయిన్‌పేటలో అత్యధికంగా 6.5 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది.

మహారాజ్‌గంజ్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్ బ్యూరో : అఫ్జల్‌గంజ్ సమీపంలోని మహారాజ్‌గంజ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున మూడంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమీపంలోని దుకాణాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు.ఈ భవనంలోని మొదటి రెండు అంతస్తులను ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు, ఇతర సామగ్రిని నిల్వచేసే గోదాములుగా వినియోగిస్తున్నారు. మూడో అంతస్తులో ఓ కుటుంబం నివాసముంటోంది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంలో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో భవనంలో మంటలు చెలరేగాయి. గోదాముల్లో తేలికపాటి సామగ్రి ఉండటంతో సులువుగా పైకి వ్యాపించాయి. దీంతో మూడో అంతస్తులోని కుటుంబసభ్యులు కేకలు వేశారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, అగ్నిమాపక, డీఆర్ఎఫ్ బృందాలు ఐదు ఫైరింజన్లతో అక్కడికి చేరుకున్నారు. మూడో అంతస్తులో ఉన్న ఓ చిన్నారి సహా ఐదుగురిని క్రేన్ సాయంతో సురక్షితంగా కిందికి తీసుకొచ్చారు.

బీమా రంగంలోకి అపోలో 24/7

ప్రజాశక్తి - హైదరాబాద్

నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంతో బీమా రంగంలోకి ప్రవేశిస్తున్నామని అపోలో హెల్త్‌కో సిఇఒ మాధివనన్ బాలకృష్ణన్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే హెల్త్, లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ పాలసీలను అందుబాటులోకి తేనున్నామని చెప్పారు. అపోలో హెల్త్‌కో ద్వారా రాబోయే రెండు నెలల్లో 12 బీమా సంస్థల నుంచి బీమా ఉత్పత్తులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొదటి ఏడాదిలో రూ.80 కోట్ల ఆదాయం సాధించాలని నిర్దేశించుకున్నామన్నారు. ఆరోగ్య సంరక్షణ ఖర్చులు తగ్గించడం, చెల్లింపుల సౌలభ్యాన్ని పెంచడంలో భాగంగా అపోలో 24/7 దేశంలోనే తొలిసారి 'హెల్త్-ఫస్ట్ క్రెడిట్ కార్డ్'ను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డ్ ద్వారా లక్షలాది మంది వినియోగదారులు ఆరోగ్య సేవలు మరింత సులభంగా పొందగలుగుతారని చెప్పారు.

ప్రయివేటు బస్సులో మంటలు

- పూర్తిగా దగ్ధం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండమైలారం నుంచి కొంపల్లికి వెళ్తున్న ఓ ప్రయివేటు బస్సులో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్సు మేడ్చల్ ఐటీఐ వద్ద రాగానే మంటలు వచ్చాయి. దాంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పక్కకు ఆపి కిందకు దిగిపోయాడు. క్షణాల్లో బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. బస్సు అప్పటికే పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు వచ్చినట్టు డ్రైవర్ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమేంటి? : ఐద్వా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సుందరీమణుల కాళ్లను మహిళలతో కడిగించటం ఏం సంప్రదాయమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనే మహిళలు రామప్ప దేవాలయ నిర్మాణం ప్రాంగణానికి విచ్చేసిన సందర్భంలో తాంబాలం పెట్టి సుందరీమణుల కాళ్లపై నీళ్లుపోస్తూ మహిళలతో వారి కాళ్లను తుడిపించడం తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఇది తెలంగాణ రాష్ట్ర గౌరవానికే తల వంపులని విమర్శించారు. ఈ కార్యక్రమానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సామ్‌సంగ్ గెలాక్సీ 25 ఎడ్జ్‌కు ప్రీ ఆర్డర్లు

హైదరాబాద్ : గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్ కోసం ప్రీ-ఆర్డర్‌లను ప్రారంభించినట్లు సామ్‌సంగ్ ఇండియా తెలిపింది. ఈ స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధర రూ.1,09,999గా ఉంది. ప్రీఆర్డర్ కస్టమర్లకు రూ.12,000 విలువైన ఉచిత స్టోరేజ్ అప్‌గ్రేడ్‌ను పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది. తొమ్మిది నెలల వరకు ఎటువంటి ఖర్చు లేని ఇఎంఐ సౌకర్యం ఉందని తెలిపింది.

ధాన్యం కొనుగోలులో అక్రమాలు

- సిబిఐతో విచారణ జరిపించాలి
- బిజెపి ఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనీ, దానిపై సిబిఐ దర్యాప్తు చేయించాలని బిజెపి ఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్ల దోపిడీ ప్రభుత్వానికి తెలిసే జరుగుతున్నదా? లేక ప్రభుత్వం కళ్లుగప్పి ఈ తతంగం నడుస్తున్నదా? అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఓవైపు అకాల వర్షాలు కురుస్తున్నాయని, మరోవైపు 15 రోజులుగా వరి ధాన్యం కొనుగోలు వ్యవహారం చాలా మందగించిందని తెలిపారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గన్నీబ్యాగులు, టార్పాలిన్లు, లారీల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. ఐకెపి కేంద్రాల ద్వారా జరగాల్సిన ధాన్యం కొనుగోళ్లను కొత్తగా పిఎసిఎస్, డిసిఎంఎస్‌లకు అప్పగించారని, అవి రాజకీయ నిరుద్యోగులకు దోపిడీ కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు చనిపోతే రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలనే సోయే సర్కారుకు లేదని విమర్శించారు. తేమ పేరుతో 40 కేజీల ధాన్యం బస్తా నుంచి నాలుగు కేజీల తరుగు తీయడాన్ని తప్పుబట్టారు. ఆ ధాన్యం ఎవరి జేబుల్లోకి పోతుందని ప్రశ్నించారు. 13 లక్షల క్వింటాళ్ల ధాన్యం తరుగు రూపంలో పక్కదారి పడుతోందని చెప్పారు. టన్నుకు రూ. 22 వేల చొప్పున దాదాపు 13 లక్షల టన్నులకు రూ. 2,860 కోట్లు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ఏ ట్యాక్స్ అని ప్రశ్నించారు. రైతులకు ఇవ్వాల్సిన రూ. 760 కోట్లు బోనస్ ఎగవేసినట్లేనా? అని నిలదీశారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న రైస్ మిల్లర్లు ఎవరు? ఇంకా వారికి ఎందుకు ధాన్యం పంపుతున్నారు? లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉన్న మిల్లర్ల నుంచి ఎందుకు రికవరీ చేయడం లేదు? వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

'చేప'పట్టకపాయె..!

- 23కు పైగా విత్తనోత్పత్తి కేంద్రాలపై సర్కారు నిర్లక్ష్యం
- వనరులున్నా పది కేంద్రాలు ఇప్పటికే మూత
- ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నా ఆంధ్రా నుంచి దిగుమతి
- మత్స్యకారుల వృద్ధి నిధులు రూ.600 కోట్లు కాంట్రాక్టర్ల పాలు
- నేరుగా సొసైటీలకే నిధులు కేటాయించాలని సిపిఎం డిమాండ్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా చేప విత్తనోత్పత్తి కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఎక్కడా నిర్వహణ సరిగ్గా లేక శిథిలావస్థకు చేరుతున్నాయి. ఏటేటా విత్తనోత్పత్తి తగ్గిపోతోంది. స్థానికంగా విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తే దేశవ్యాప్తంగా ఎగుమతి చేసే సామర్థ్యం రాష్ట్రంలోని ఉత్పత్తి కేంద్రాలకు ఉన్నా.. ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఏటేటా ఉత్పత్తి పడిపోతోంది. ఈ కారణంతో ప్రతి సంవత్సరం ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. తద్వారా ప్రతియేటా టెండర్లు ఆలస్యమవుతున్నాయి. మత్స్యసొసైటీలకు నష్టం వాటిల్లుతోంది. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి పునరావృతం అవుతున్నా ప్రభుత్వాల వైపు నుంచి సరైన స్పందన ఉండటం లేదని మత్స్యసొసైటీలు గగ్గోలు పెడుతున్నాయి. మత్స్యకారుల వృద్ధి కోసం కేటాయించే రూ.600 కోట్ల నిధులు నేరుగా సొసైటీలకే విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 6000 మత్స్యకార సొసైటీలు, సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో సుమారు ఆరు లక్షల మంది మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి. ఒక్కో చేపల ఉత్పత్తి కేంద్రం వంద చెరువులు, కుంటలకు పిల్లలను పంపిణీ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి. వీటిని వినియోగించుకోకుండా కాకినాడ, భీమవరం నుంచి పిల్లలను దిగుమతి చేసుకుంటున్నారని సిపిఎం తెలిపింది. మత్స్యకార్మికులు ఏటా రూ.30వేల కోట్ల వ్యాపారం చేస్తూ వారు జీవించటమే కాకుండా రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నిండా నిర్లక్ష్యం

దాదాపు 150 కోట్లకు పైగా చేపపిల్లలను ఉత్పత్తి చేసే కేంద్రాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్న విమర్శలున్నాయి. మరోవైపు వీటి కొనుగోలుకు ఏటా కాంట్రాక్టర్లకు రూ.100 కోట్లకు పైగా చెల్లిస్తోంది. గతేడాది నిబంధనలు మార్చడంతో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారారు. 30 జిల్లాల్లో ఎక్కడా టెండర్లు వేయకుండా నిరాకరించారు. ఫలితంగా అక్టోబర్ వరకు చాలా జిల్లాల్లో టెండర్లు దాఖలు కాలేదు. రెండు, మూడు సార్లు టెండర్లు పిలిచినా ఇదే పునరావృతమైంది.

వనరులున్నా...

రాష్ట్రంలో 19 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. వీటిని వినియోగించుకునే ప్రయత్నం చేయకుండా ప్రభుత్వం ఏటా టెండర్లు పిలిచి చేప పిల్లలను కొనుగోలు చేస్తోంది. 2014 తర్వాత నూతన జల వనరుల దగ్గర మరో నాలుగు చేపల ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం వీటి సంఖ్య 23కు చేరింది. 19 జిల్లాల్లో 390.61 ఎకరాల్లో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో భవనాలు, షెడ్లు ఉన్నాయి. చిన్నట్యాంకులు, క్షేత్రాలను ఏర్పాటు చేశారు. చేపలకు కృత్రిమ గర్భధారణ విధానాల ద్వారా విత్తనోత్పత్తి చేసి వాటిని 13 నుంచి నెలరోజులు పెంచి చెరువులు, కుంటల్లో పెంచేందుకు పంపిణీ చేస్తారు. కానీ చేపల పంపిణీ పథకం ప్రారంభమైన తర్వాత ఏ ఒక్కరోజు కేంద్రాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఏటేటా ఉత్పత్తి కేంద్రాలకు ఇచ్చే నిధులను తగ్గించేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి ఐదుగురు సిబ్బంది ఉండాలి. కానీ ఒకరిద్దరితోనే నెట్టుకొస్తున్నారు. సిబ్బంది లేక కొన్ని కేంద్రాలకు తాళాలు వేసిన సందర్భాలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా జుక్కల్ మండలంలోని అచ్చంపేట చేప విత్తనోత్పత్తి కేంద్రానిది ఏడాది క్రితం వరకు ఇదే పరిస్థితి.

ఎవరికీ పట్టని 'వైరా' చేప ఉత్పత్తి కేంద్రం

ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్‌లో నాలుగేండ్ల క్రితం చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. కోటి పిల్లల ఉత్పత్తి లక్ష్యంతో ప్రారంభమైన ఈ కేంద్రంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా తొలి ఏడాది పది లక్షల పిల్లలను మాత్రమే ఉత్పత్తి చేశారు. ఆ తర్వాత క్రమేణా తగ్గుతూ ఐదారు లక్షలకు పడిపోయాయి. గతేడాది రెండు లక్షల పిల్లలను మాత్రమే ఉత్పత్తి చేశారు. ఈ కేంద్రం నిర్వహణకు ఏటా రూ.కోటి నిధులు కావాల్సి ఉండగా రూ. లక్ష, రెండు లక్షలు మాత్రమే విడుదల చేస్తున్నారు.

బినామీలుగా అధికారుల సంబంధీకులు..!

ఏటా చేపపిల్లల పంపిణీ పథకం కోసం ప్రభుత్వం జిల్లాల వారీగా టెండర్లు పిలుస్తోంది. 10నుంచి 12 మంది కాంట్రాక్టర్లు వీటిని దక్కించుకుంటున్నారు. కొందరు అధికారుల సంబంధీకులు బినామీలుగా అవతారం ఎత్తుతున్నారు. టెండర్ పొందిన తర్వాత సరిగా పంపిణీ చేయటం లేదు. అయినప్పటికీ వీరికి ప్రతేడాది రూ.100 కోట్లు చెల్లింపులు చేస్తున్నారు.

సిండికేట్‌గా మారి టెండర్లలో జాప్యం

మత్స్యశాఖ డైరెక్టరేట్ అధికారుల సంబంధీకులే టెండర్‌దారులు కావటంతో సిండికేట్‌గా మారుతున్నారన్న ఆరోపణలున్నాయి. వ్యూహాత్మకంగా టెండర్లకు ముందుకు రాకుండా నిరాకరిస్తున్నారని ఫిర్యాదులున్నాయి. జాప్యమయ్యే కొద్దీ మత్స్యసొసైటీలపై ఒత్తిడి పెరుగుతుంది. ఆ ప్రభావం ప్రభుత్వంపై పడేలా చేసి పెండింగ్ బిల్లులను విడుదల చేయించుకున్న తర్వాత టెండర్లకు సిద్ధమవుతున్నారు. గతేడాది మూడుసార్లు టెండర్లు పిలిస్తే గానీ ముడిపడలేదు. 2024 జులై 23వ తేదీన ఒకసారి, ఆగస్టు 2వ తేదీన మరోసారి టెండర్లు పిలిచారు. రెండుసార్లూ ఎవరూ ముందుకు రాకపోవడంతో తిరిగి ఆగస్టు 13న మూడోసారి ఆహ్వానించారు. ఏటా రాష్ట్రవ్యాప్తంగా 23వేలకు పైగా చెరువుల్లో చేపల పెంపకం చేపడతారు. చిన్నచెరువుల్లో 35-40 మి.మీ పిల్లలు 41.63 కోట్లు, పెద్ద చెరువుల్లో 80-100 మి.మీ పైగా సైజ్ ఉన్న పిల్లలు 34.74 కోట్లు పంపిణీ చేస్తారు. అలాగే 357 మంచినీటి చెరువులకు 9.15 కోట్ల రొయ్య పిల్లలను సరఫరా చేస్తారు. చిన్నపిల్లలకు హెక్టార్‌కు మూడు వేల చొప్పున లక్ష పిల్లలకు రూ.51వేలు, పెద్ద వాటికి హెక్టార్‌కు రెండువేల చొప్పున లక్ష పిల్లలకు రూ.1.61 లక్షలు చెల్లిస్తారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి

- సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. ఎనిమిది వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఫీజురీయింబర్స్‌మెంట్‌పై సిఎం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయనీ, అధ్యాపకులకు, సిబ్బందికి జీతభత్యాలు, మెయింటెనెన్స్ చార్జీలు కూడా చెల్లించకలేక ఇబ్బంది పడుతున్నాయని లేఖలో ప్రస్తావించారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడ్డ విషయాన్ని ఎత్తిచూపారు. శాతవాహన వర్సిటీ పరిధిలోనే పదుల సంఖ్యలో డిగ్రీలు మూతపడ్డాయని తెలిపారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోకపోవడంతో కొన్ని కాలేజీలు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదనీ, దీంతో పిల్లలు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరం అవుతున్నారని వివరించారు. విద్యార్థులకు, కాలేజీ యాజమాన్యాల మధ్య గొడవలై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళ్తున్నా పట్టించుకోరా? అని ప్రశ్నించారు. ఫీజు బకాయిలన్నీ వన్ టైం సెటిల్ మెంట్ చేస్తామని ఒకసారి, 12 వాయిదాల్లో చెల్లిస్తామని మరోసారి చెప్పిన విషయాన్ని మర్చిపోయారా? అంటూ చురకలు అంటించారు. విద్యార్థుల భవిష్యత్తు, యాజమాన్యాల మనుగడను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు.

సిఎం రేవంత్ రెడ్డి తప్పు ఒప్పుకోవాలి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలపై గురువారం కెటిఆర్ స్పందించారు. ప్రభుత్వం తరఫున వాదిస్తున్న అడ్వొకేట్‌ను హెచ్చరించిన సుప్రీంకోర్టు, కంచ గచ్చిబౌలి అడవుల విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు అధికారులను జైలుకు పంపించాలా అంటూ హెచ్చరించిందని తెలిపారు. రేవంత్ రెడ్డి చేసిన తప్పులకు తెలంగాణ ప్రభుత్వ అధికారులు శిక్ష ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసిందన్నారు. వీటన్నింటికీ తాను బాధ్యుడిని కాదని రేవంత్ రెడ్డి తప్పించుకునే అవకాశం లేదని కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై, కంచ గచ్చిబౌలి వ్యవహారంలో చేసిన తప్పులను ఒప్పుకోవాలని సూచించారు. వందల బుల్డోజర్లతో ధ్వంసం చేసిన కంచ గచ్చిబౌలి అడవులను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రేవంత్ రెడ్డికి కోర్టు శిక్షలు తప్పవని హెచ్చరించారు. కంచ గచ్చిబౌలి భూములను అమ్మి రూ.10 వేల కోట్ల స్కాం చేయడం ముమ్మాటికి అవినీతి, నమ్మక ద్రోహమేనని స్పష్టం చేశారు. సెలవు దినాల్లో బుల్డోజర్లను పంపి అడవులను ధ్వంసం చేయడం ముమ్మాటికి పర్యావరణ చట్టాల ఉల్లంఘనేనని తేల్చి చెప్పారు.

మార్కెట్ యార్డులో రైతులపై దాడి

- జొన్నల చోరీకి యత్నం..
- అడ్డుకున్న రైతులపై కాలనీవాసుల దాడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో అర్ధరాత్రి జొన్నల చోరీకి యత్నించిన వారిని అడ్డుకున్న రైతులపై పక్క కాలనీవాసులు దాడి చేశారు. బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు మార్కెట్ యార్డులో జొన్నలను దొంగిలించేందుకు యత్నించారు. వారిని రైతులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పక్కనే ఉన్న కాలనీవాసులు అక్కడికొచ్చి రైతులపైనే దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రాంపూర్‌కు చెందిన దిలీప్‌రెడ్డి, భరంపూర్‌కు చెందిన నారాయణకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి పండరికి సమాచారం అందించారు.

ఆయన పోలీసులకు చెప్పడంతో వారు వెంటనే అక్కడికి చేరుకొని సిసిటివి ఫుటేజీని పరిశీలించారు. గాయపడిన రైతులకు చికిత్స అందించారు. నాలుగు రోజులుగా జొన్నలను కొనుగోలు చేయకపోవడంతో ఇక్కడే కాపలా ఉంటున్నామని రైతు దిలీప్‌రెడ్డి తెలిపాడు. బుధవారం రాత్రి దొంగతనానికి వచ్చిన వారిని పట్టుకున్నామన్నారు. అయితే, పక్క కాలనీకి చెందిన వారొచ్చి తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో రక్షణ కల్పించేలా పోలీసు బందోబస్తు పెట్టాలని కోరారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న గురువారం మార్కెట్ యార్డులో రైతులను పరామర్శించారు. సెంటర్ ఇన్‌చార్జితో మాట్లాడి భద్రత విషయాలు తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో రక్షణ లేకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి విషయమై ఎస్పీ, కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని చెప్పారు. రైతులపై దాడి విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు సైతం మార్కెట్ యార్డును సందర్శించారు. గాయపడిన రైతులను పరామర్శించారు. జొన్నల కొనుగోళ్లలో రైతుల బాధలను అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని సిపిఎం ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు అన్నారు. ఈ క్రమంలోనే చోరీకి యత్నం, రైతులపై దాడి జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

కుటుంబ వ్యవస్థ భారతీయ సంస్కృతికి పునాది



ప్రజాశక్తి కల్చరల్

ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతన మైనదని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతి పక్షనేత సిరికొండ మధుసూదనా చారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీత్యాగరాయ గానసభ నందు అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవం సందర్భంగా ప్రముఖులకు ఆదర్శ కుటుంబం అవార్డు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది.

ఈసందర్భంగా ఆదర్శ కుటుంబం అవార్డు గ్రహీతలు శోభ, డాక్టర్ రామచంద్రరావు, మాధవి, వై.శ్రీనివాసులు, రేణుక, డాక్టర్ మధుసూదన్ రావు, బత్తిన పద్మ, నరసింహులు గౌడ్, సుజాత, శంకర్, ఆమంచ అంజయ్య లను అవార్డుతో సత్కరించారు. ఈకార్యక్రమానికి సభాధ్యక్షులుగా మురళీమోహన్ రాజు వ్యవహరిం చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, సినీ దర్శకులు డాక్టర్ నిట్టాల గోపాలకష్ణ, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బూర్గుల మధుసూదన్ రావు, కార్పొరేటర్ ట్రైనర్ సర్వేపల్లి గోపికష్ణ, కవయిత్రి డాక్టర్ రాధా కుసుమ, నిర్వా హకులు కె మురళీమోహన్ రాజు పాల్గొన్నారు.

తప్పుడు ప్రకటనతో మందుల అమ్మకాలు

- డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడుల్లో పట్టివేత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తప్పుడు ప్రకటనలో అమ్ముతున్న మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అన్ని రకాల జ్వరాలకు చికిత్స కోసమంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ విక్రయిస్తున్న హెర్బల్ ఫీవర్ గార్డ్ సిరప్‌ను సీజ్ చేశారు. దీనిని ఉత్తరాఖండ్ హరిద్వార్‌కు చెందిన ఇంటర్నేషనల్ హెర్బల్ కార్పొరేషన్ ప్రయివేట్ లిమిటెడ్ తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నది. ఆదిలాబాద్‌లోని ఒక మెడికల్ షాప్‌పై దాడి చేసి డ్రగ్ కంట్రోల్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేసే వ్యక్తులకు ఆరు నెలల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశముందని హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు సిద్ధిపేట జిల్లా, గజ్వేల్ మండలం, అహ్మదీపూర్ గ్రామంలోని అర్హత లేని నకిలీ వైద్యులు కె.రామచంద్రం నిర్వహిస్తున్న క్లినిక్‌పై అధికారులు దాడి నిర్వహించారు. ఆయన వద్ద నుంచి రూ.20 వేల విలువైన 12 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆయన వద్ద దొరికిన మందుల సెఫిక్సిమ్ వంటి యాంటీ బయాటిక్స్ వంటి మందులున్నాయని అధికారులు తెలిపారు. వీటిని ఇష్టానుసారంగా విక్రయించడం, వాడటం ద్వారా ప్రజారోగ్యం మరింత క్షీణించే ప్రమాదముందని అధికారులు హెచ్చరించారు. ఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులను నిల్వ ఉంచి అమ్మితే చట్ట ప్రకారం గరిష్టంగా ఐదేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశముందని హెచ్చరించారు.

సింగరేణి ఓసిపి-2లో భారీ బ్లాస్టింగ్

- బండరాళ్లు ఎగిరిపడి ఇళ్లు ధ్వంసం
- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా సింగరేణి రామగుండం-3 డివిజన్ పరిధిలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2 క్వారీ పక్కన ఉన్న ఎల్-6 కెనాల్‌లో గురువారం మధ్యాహ్నం పెద్దఎత్తున బ్లాస్టింగ్ జరిగింది. దాంతో సమీపంలోని నాగపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. భారీ పేలుడు ధాటికి బండరాళ్లు ఎగిరి ఇండ్లపై పడటంతో ఆస్తి నష్టం సంభవించడమే కాకుండా, పలువురికి గాయాలయ్యాయి. బ్లాస్టింగ్ శబ్దానికి భూమి కంపించడంతో ఏం జరుగుతుందో తెలియక జనం పరుగులు తీశారు. పెద్దపెద్ద బండరాళ్లు ఇళ్లపై పడడంతో రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సింగరేణి అధికారులు పేలుడు పదార్థాల మోతాదు పెంచి బ్లాస్టింగ్ చేపట్టడమే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు. నిత్యం జరుగుతున్న బ్లాస్టింగ్‌ల వల్ల గ్రామంలో ఉండలేకపోతున్నామని ఆవేదన చెందారు. ఈ బ్లాస్టింగ్‌లకు నిరసనగా గ్రామస్తులంతా ప్రధాన రహదారిపైకి చేరుకొని బైటాయించి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించే ప్రయత్నం చేశారు.

అపోలో హెల్త్‌కేర్‌తో ఎస్‌బిఐ కార్డ్ జట్టు

న్యూఢిల్లీ : ప్రముఖ క్రెడిట్ కార్డుల జారీ సంస్థ ఎస్‌బిఐ కార్డ్, దిగ్గజ రిటైల్ ఫార్మసీ చెయిన్ అపోలో హెల్త్‌కో కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా అపోలో ఎస్‌బిఐ కార్డ్ సెలెక్ట్ కార్డ్‌ను ఆవిష్కరించాయి. ఈ కార్డ్ ద్వారా అపోలో 24/7 యాప్, ఎంపిక చేసిన అపోలో ఫార్మసీ రిటైల్ స్టోర్‌లో కొనుగోళ్లపై 25 శాతం వరకు క్యాష్ బ్యాక్‌ను పొందవచ్చని ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. ఈ క్రెడిట్ కార్డ్ కోసం తమ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించింది. ఈ కార్డ్‌తో ఆరోగ్య చెకప్‌ల్లోనూ తగ్గింపు, రివార్డులను పొందవచ్చని పేర్కొంది. స్వాగత ప్రయోజనంగా రూ.1,500 విలువ చేసే ఎలక్ట్రానిక్ ఓచర్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.

ప్యాసింజర్ రైలు ఇంజిన్‌లో మంటలు

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి కాచిగూడ బయలుదేరిన డెమో ప్యాసింజర్ రైలు ఇంజిన్ కింది భాగంలో మంటలు వచ్చాయి. ఈ ఘటన గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో జరిగింది. రైల్వే పోలీసులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి కాచిగూడకు బయలుదేరిన ప్యాసింజర్ ఉదయం ఎనిమిది గంటలకు నాగిరెడ్డిపల్లి స్టేషన్ వద్దకు రాగానే రైలు ఇంజిన్ కింది భాగంలోని గేరు బాక్స్‌లో మంటలు వచ్చాయి. ప్రయాణికులు గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో ఆపారు. అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పి ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో వివిధ రైళ్ల రాకపోకలకు సుమారు గంటపాటు అంతరాయం ఏర్పడింది.

భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య మనస్తాపం..

- కొడుకుతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భర్త అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని మనస్తాపం చెందిన భార్య.. కొడుకుతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్ట్ 12వ గేటు వద్ద జరిగింది. నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన ప్రమీల (30) భర్త సాయిలు అప్పుల బాధతో 20 రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటినుంచి మనస్తాపం చెందిన ప్రమీల.. తన కుమారుడు అక్షయ్ (8)తో కలిసి బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి నిజాంసాగర్ ప్రాజెక్టు 20వ గేటు వద్ద కొడుకుతో సహా దూకి ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లిన జాలర్లు మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బాన్సువాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమీల తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథగా కూతురు..

ప్రమీల సాయిలు దంపతులకు కొడుకుతో పాటు కుమార్తె నిహారిక (12) ఉంది. నాన్న ఆత్మహత్య చేసుకోవడంతో పాటు అమ్మ, తమ్ముడు సైతం నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకోవడంతో నిహారిక అనాథ అయ్యింది.

నాంపల్లిలో రౌడీ షీటర్ దారుణ హత్య

- కోర్టు నుంచి తిరిగి వస్తుండగా కత్తులతో పొడిచిన దుండగులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నాంపల్లి రెడ్ హిల్స్ ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో రౌడీ షీటర్ దారుణంగా హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. చాంద్రాయణగుట్టకు చెందిన అయాన్ ఖురేషీ(23)పై రౌడీ షీట్ ఉంది. ఒక కేసు నిమిత్తం గురువారం నాంపల్లి కోర్టుకు హాజరై తిరిగి యాక్టివా స్కూటర్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతను ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రి వద్దకు రాగానే నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై ఒక్కసారిగా దాడి చేశారు. మొదట దుండగులు ఖురేషీని క్రికెట్ బ్యాట్‌తో తీవ్రంగా కొట్టారు. అనంతరం కత్తులతో గొంతు కోసి, పొట్టలో విచక్షణారహితంగా పొడిచి హతమార్చారు. బ్యాట్, కత్తులను సంఘటనా స్థలంలోనే వదిలి పరారయ్యారు. సమాచారం అందుకున్న నాంపల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

హైదరాబాద్‌లో ముంబయి సిటీ ప్లానర్ నివాసాలపై ఇడి దాడులు

- రూ.32 కోట్ల నగదు, బంగారం స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముంబయికి చెందిన సిటీ ప్లానర్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డికి చెందిన హైదరాబాద్‌లోని నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.తొమ్మిది కోట్ల నగదు, రూ.23 కోట్ల బంగారు ఆభరణాలతో పాటు ఇతర విలువైన సామాగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు ఇడి వర్గాలు వెలిపారు. 41 బహుళ అంతస్థుల భవనాలకు నింబధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారన్న ఆరోపణలున్నాయి. దాని ఆధారంగానే మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారని ఇడి దృష్టికొచ్చింది. దీంతో హైదరాబాద్‌లోని వైఎస్ రెడ్డి నివాసంపై ఇడి అధికారులు మెరుపు దాడులు చేశారు. దీంతో పాటు ముంబయిలోని అతని ఫ్లాట్, కార్యాలయాల్లోను ఇడి దాడులు జరిగాయి.

దిగొస్తున్న బంగారం... మరో రూ.2,130 తగ్గుదల

న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా సానుకూల వాతావరణం నెలకొనడంతో బంగారం ధరలు దిగివస్తోన్నాయి. మరోవైపు డిమాండ్ తగ్గడంతో గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,130 తగ్గి రూ.94,080గా పలికింది. గుడ్ రిటర్న్స్ ప్రకారం.. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడిపై రూ.1,950 తగ్గి రూ.86,250కి దిగివచ్చింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల ధర రూ.93,930గా, 22 క్యారెట్ల ధర రూ.86,100గా నమోదయ్యింది. మరోవైపు తాజాగా కిలో వెండిపై రూ.900 తగ్గి రూ.97,000గా చోటు చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌గోల్డ్ ఔన్సు 16 డాలర్లు తగ్గి 3160 డాలర్ల వద్ద, వెండి ఔన్సు 32 డాలర్ల వద్ద నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏప్రిల్‌లో ఔన్సు 3500 డాలర్ల వరకు వెళ్లింది. తాజాగా పసిడి దాదాపు 10 శాతం క్షీణించి 3150 డాలర్ల స్థాయికి దిగి వచ్చింది. కాగా.. బంగారం ఇప్పటి వరకు ఆల్‌టైమ్ గరిష్ఠాల నుంచి భారీగా క్షీణించింది. దేశీయంగా రూ.1లక్ష మార్కు దాటిన బంగారం ధరలు ఇటీవల దాదాపు రూ.7-8 వేల మేర దిగిరావడంతో కొనుగోలుదారులకు కొంత ఉపశమనం కలిగిస్తోంది. భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ఇన్నాళ్లు సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి మదుపర్లు బంగారంలో మదుపు చేయడంతో ఈ లోహానికి డిమాండ్ ఏర్పడటంతో పసిడి ధరలు ఎగిశాయి. అమెరికా, చైనా దేశాలు వాణిజ్య యుద్ధానికి స్వస్తి చెప్పి..ఓ ఒప్పందానికి రావడం, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు సంకేతాలు బంగారం ధర తగ్గుదలకు ప్రధాన కారణం.

సెన్సెక్స్ 1200 పాయింట్ల వృద్ధి

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో దలాల్ స్ట్రీట్ భారీ లాభాల్లో సాగింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలతో గురువారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత ర్యాలీ చేశాయి. దేశీయంగా ద్రవ్యోల్బణం తగ్గుదలకు తోడు వడ్డీ రేట్లు తగ్గొచ్చనే అంచనాల నేపథ్యంలో సూచీలు రాణించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1200 పాయింట్లు లేదా 1.48 శాతం పెరిగి 82,530కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 395 పాయింట్లు లేదా 1.60 శాతం లాభంతో 25,062 వద్ద ముగిసింది. నిఫ్టీ ఫైనాన్సియల్ 1.3 శాతం, ఆటో 1.9 శాతం, ఐటి 1.2 శాతం, మెటల్ 1.7 శాతం చొప్పున లాభపడ్డాయి. స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.7 శాతం చొప్పున రాణించాయి. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.5.05 లక్షల కోట్లు పెరిగి రూ.439.94 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, మారుతీ సుజుకీ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.